

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల బ్రోచర్ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇండియన్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ వై. ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుండి దాదాపు 300 మంది బాడీ బిల్డర్స్ ఈ పోటీలలో పాల్గొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ లో బాడీ బిల్డింగ్ అభివద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన పేర్కొన్నారు ఈనెల 13వ తేదీ నుంచి జరిగే ఈ పోటీలకు తన వంతు సహాయంగా 55 వేల రూపాయలు స్పాన్సర్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పోటీలు నిర్వహిస్తున్నది కడప జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్, ప్రకాశం డిస్ట్రిక్ బాడీ బిల్డర్ అసోసియేషన్ లకు శుభాకాంక్షలు అందజేశారు.

మెర్జింగ్ వద్దు.. మా బడే ముద్దు..!


పాఠశాలల్లో
గ్రామస్తుల ధర్నాలు
తప్పుడు నివేదికలపై ఆగ్రహం
మండల విద్యాశాఖ
కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - కెవిబిపురం, సత్యవేడు, నాయుడుపేట

'విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి మాపిల్లల్ని స్కూలుకు పంపడం లేదు.. గత 22 రోజులుగా మా పిల్లలు బడి బయటనే ఉన్నారు.. తల్లిదండ్రులు, విద్యాకమిటీల నుంచి దొంగ సంతకాలు చేయించి పాఠశాలల విలీనానికి ఒప్పుకున్నారని తప్పుడు నివేదికలు పంపించారు.. మా బడి మాకే కావాలి అని నిత్యం ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది' అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి జనార్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, సిఐటియు నాయకులు నాగరాజు అన్నారు. కెవిబిపురం మండలంలో దాదాపు 44 పాఠశాలలను మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో తరలించడం వల్ల సాహసించి అంత దూరం బడికి పంపలేమని తల్లిదండ్రులు వాపోయారు. 'మా ఊరి బడి మాకే కావాలి' అంటూ దాదాపు పది గ్రామాల ప్రజలు ఎస్ఎల్ పురం, మహాదేవిపురం, గురుకులకండ్రిగ, అప్పనగుంట, బంగారంకండ్రిగ, జ్ఞానమాకండ్రిగ, తిమ్మసముద్రం, ఎగువపూడి హెచ్‌డబ్ల్యు, పాత పాల్యం, ఒహత్తూరు ఎస్‌సి కాలనీ, సరస్వతిపురం గ్రామాల నుంచి మండల విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, జనార్ధన్, భగత్‌రవి మాట్లాడుతూ పాఠశాలల విలీన ప్రక్రియను బలవంతంగా గుట్టుచప్పుడు కాకుండా తల్లిదండ్రులు, విద్యాకమిటీ ఛైర్మన్లే వారి సంతకాలను దొంగతనంగా పెట్టించి, అభిప్రాయాలు తీసుకోకుండా పంపించడం దుర్మార్గమన్నారు. వాగులు, వంకలు, శ్మశానవాటికలు, జాతీయ రహదారుల మీదుగా తమ పిల్లలను అంత దూరం పంపించలేమని తల్లిదండ్రులు చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. 44 పాఠశాలలను మూసివేసి, 25 మోడల్ పాఠశాలలు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. ఈ చర్య వల్ల విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలన్నారు. తల్లిదండ్రులు అందరూ కలిసి ఎంఇఒకు తమ గోడును వినిపిస్తూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ర్యాలీగా ఎంపిడిఒ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు హరి, బంగారయ్య, వెంకటేష్, లత, మునిస్వామి, మహేష్, పద్మ, హేమ పాల్గొన్నారు.

- సత్యవేడులోని మదనంబేడు పాఠశాలలో పేరడం విద్యార్థులను మెర్జింగ్ చేయడాన్ని నిరసిస్తూ ఎంఇఒ కార్యాలయం వద్ద తల్లిదండ్రులు విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ వారి ఆందోళనకు మద్దతు తెలిపారు. పేరడం గ్రామంలో గిరిజన, దళిత బలహీన వర్గాలకు చెందిన 20 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ప్రభుత్వం తీసుకొచ్చిన మెర్జింగ్ విధానం వల్ల మదనంబేడు పాఠశాలకు బలవంతంగా విద్యార్థులను తరలించాలని చూడటం తగదన్నారు. గత కొద్దిరోజులుగా పేరడం గ్రామస్తులు పోరాటాలు చేస్తున్నా విద్యాశాఖ అధికారి నుంచి స్పందనే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పేరడం గ్రామస్తులు కిష్టయ్య, మునస్వామి, సుందరం, సెల్వం, వెంకటేష్, రాణమ్మ, కొల్లాపిరి, ముత్తు, శాంతి, పోలయ్య పాల్గొన్నారు.

- నాయుడుపేటలో సిఐటియు నాయకులు శివకవి ముకుంద ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి శనివారం విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. చంద్రబాబునాయుడు నగర్ ఏర్పాడ్డాక కాలనీ పిల్లలకోసం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి తమ కాలనీ పిల్లలు ఎంతోమంది పై క్లాసులకు, ఉద్యోగాలకు వెళ్లారని, అన్నేళ్ల చరిత్ర కలిగిన పాఠశాలను ఇపుడు విలీనం పేరుతో మూసివేసి, రెండు కిలోమీటర్ల దూరంలోని తుమ్మూరు పంపాలనడం బాధాకరం అన్నారు. తుమ్మూరుకు పోవాలంటే రైలు కట్ట దాటి నిత్యం భారీ వాహనాలు తిరిగే హైవే మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. గ్రామస్తులు విలీనం వద్దని మొరపెట్టుకుంటున్నా ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ స్పందించకపోవడం బాధాకరమన్నారు.పిల్లల తల్లులు నిర్మల, రమణమ్మ, పద్మమ్మ,రేవతి, షాహీనా, కృష్ణవేణి పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తూ..



పేరడం గ్రామస్తుల ధర్నా

10న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్


ప్రజాశక్తి - తిరుపతి టౌన్



జిల్లావ్యాప్తంగా 10వ తేదీన పేరెంట్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్యసాయి జిల్లాలో పాల్గొంటారన్నారు. తిరుపతి జిల్లాలో సర్పంచి మొదలు ఎంపి వరకూ ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొంటారన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఇంటర్మీడియట్ కళాశాలల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్న భోజన సమయం వరకూ ఉంటుందన్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం ఉంటుందన్నారు. మధ్యాహ్న భోజనంపై తల్లిదండ్రుల అభిప్రాయాన్ని తీసుకుంటామన్నారు. ఆధార్ అప్డేట్ కాని వారికి రెండు మూడు వారాల్లో సరిజేసి ఖాతాల్లో తల్లికి వందనం మొత్తాలను జమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్య శాఖ ద్వారా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ప్రతి స్కూలు వద్ద రెవెన్యూ, పోలీసు వారితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌ను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో విన్నూత్నంగా చేపడుతున్నామన్నారు. పాఠశాలల విలీనానికి సంబంధించి పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ స్పందిస్తూ గత ఏడాది రేషనలైజేషన్ పద్ధతిన 534 పాఠశాలలు విలీనం చేశామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో మోడల్‌ప్రైమరీ స్కూలు ఏర్పాటు చేయడం వల్ల అదనంగా ప్రతి క్లాసుకూ ఒక టీచర్ రావడం జరిగిందన్నారు. గతంలో ఆరు సబ్జెక్టులు ఉంటే అన్నింటికీ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ ఒకే క్లాసు టీచర్ ఉండేవారన్నారు. దీనిని సంస్కరించడంలో భాగంగా మోడల్ ప్రైమరీ స్కూలు చేస్తున్నామన్నారు. ఏ పాఠశాలనూ మూసివేయడం జరగదన్నారు. ఎక్కువ దూరం ఉంటే విద్యార్థులకు నెలకు 600 రూపాయల చొప్పున తల్లుల ఖాతాలో రవాణా ఛార్జీలు వేస్తామన్నారు. జిల్లాలో 650 మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆర్ఐఒ రాజశేఖర్, సమగ్ర శిక్ష సిఎండి సురేష్, సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.

తుడా చైర్మన్‌ను కలిసిన సత్యవేడు ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం తుడా కార్యాలయంలో ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవేడు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. తుడా లేఔట్లు, పార్కులు, రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ వేయాలని సూచించారు. అభివృద్ధిపనులకు నిధులు కేటాయించాలని కలెక్టర్ వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను కోనేటి ఆదిమూలం కోరారు.

అలిపిరి టోల్‌గేట్ విస్తరణకు చర్యలు : ఈవో

ప్రజాశక్తి -తిరుమల



శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న భవనాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలసి శనివారం అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టిటిడిలో జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుని నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుత్తేదారులలో అలసత్వం లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలని కోరారు. టిటిడిలో దళారి వ్యవస్థ, నకిలి టికెట్ల పేరుతో సేవల టికెట్ల అమ్మకాలు, అవినీతిపై మరింత నిఘా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు మరింత నాణ్యంగా, వేగంగా సేవలు అందించేందుకు అలిపిరి టోల్ గేట్ ప్లాజా వద్ద చెకింగ్ పాయింట్ విస్తరణ, లేటెస్ట్ కెమెరాల ఏర్పాటు, వాహనాలు, లగేజీ స్కానింగ్ యంత్రాలు, సెక్యూరిటీ పెంచే అంశం తదితర అంశాలపై టిటిడి సెక్యూరిటీ, ఇంజనీరింగ్, ఐటీ అధికారులు అంతర్జాతీయ విమానాశ్రయాలలో సౌకర్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో కళ్యాణ కట్ట కొరకు ఎంపిక చేసిన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా నిర్మాణం చేపట్టి దశలవారీగా విస్తరణ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించేందుకు నిల్వ వుంచే వంటసామాగ్రి కోసం మార్కెటింగ్ గోడౌన్ లో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్ లో భాగంగా అలిపిరి భూదేవి కాంప్లెక్స్ లో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి. మురళీకష్ణ, ఎఫ్.ఏ అండ్ సీఏవో ఓ. బాలాజీ, టివి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజీ చేసుకున్నా ప్రమాద బీమా వర్తిస్తుంది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



ప్రమాదం, క్రిమినల్ కేసులు రాజీ చేసుకున్నా బీమా వర్తిస్తుందని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. శనివారం జాతీయ లోక్అదాలత్ పుత్తూరు కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలకు గురైన కక్షిదారులు రాజీకి లోబడి క్రిమినల్‌కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ రమ్యసాయి మాట్లాడుతూ కక్షిదారులు పంతానికి పోకుండా కలసి ఉండాలన్నారు. అనంతరం లోక్అదాలత్‌లో భార్యాభర్తలు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించగా కల్యాణపురం గ్రామానికి చెందిన అశోక్, తిరుపతికి చెందిన పవిత్రలకు కౌన్సిలింగ్ ఇచ్చి పూలదండలు మార్పించి, అన్యోన్యంగా ఉండాలని దంపతులను కలిపారు. అనంతరం పుత్తూరు కోర్టు ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కక్షిదారులకు ఉచితంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గాలి సురేష్‌బాబు, కార్యదర్శి రాజేష్, జానకిరామ్, దినకర్, కె.పురుషోత్తం, విజయ్‌కుమార్, మురగేషన్‌రెడ్డి పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తిలో... కేసు ఏదైనా లోక్ అదాలత్ లో ఇచ్చే తీర్పే తుది అని జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్ నాయక్ అన్నారు. అదాలత్ లో తీర్పు వెలువడ్డాక అప్పీలు చేసుకునే అవకాశం లేదని స్పష్టం చేశారు. స్థానిక శ్రీకాళహస్తి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. పెద్ద ఎత్తున కక్షిదారులు పాల్గొన్నారు. సమానం, సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్ ఉపయోగించుకోవాలని జిల్లా జడ్జ్ శ్రీనివాస్ నాయక్ పిలుపునిచ్చారు.

- సూళ్లూరుపేట కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి పి.సంయుక్త ఆధ్వర్యంలో 98 కేసులను రాజీ చేశారు. వాటిలో 62 క్రిమినల్ కేసులు కాగా, మూడు సివిల్, బ్యాంక్, బిఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు 33 ఉన్నాయి. సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

స్వర్ణముఖి, అరణియర్ నదుల్లో ఇసుక తవ్వకాలు నిషిద్ధం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

నైరుతి రుతుపవనాల ప్రారంభం నుండి ముగింపు వరకు వర్షాకాలంలో తిరుపతి జిల్లా పరిధిలోని స్వర్ణముఖి, అరణియార్ నదులలో జూన్ 1, 2025 నుండి అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలను నిషేధించామని జిల్లా ఇసుక కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. భారత ప్రభుత్వం పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ నుండి సంబంధిత విభాగాల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ నిషేధిత కాలంలో అధికత ఇసుక సరఫరా పాయింట్ల నుండి ఇసుక పొందవచ్చన్నారు. స్వర్ణముఖి బ్యారేజి గూడలి డి-సిల్టేషన్ యార్డులు, అవిలాల యార్డు, కాటన్ మిల్ యార్డు, గాజుల మన్యం యార్డు, శ్రీకాళహస్తి యార్డు, వెంకటగిరి యార్డు అధికత స్టాక్ పాయింట్లలో ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలను చెల్లించి కావలసిన పరిణామంలో ఇసుకను వినియోగదారులు తీసుకెళ్లొచ్చు అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక వినియోగదారులు వాగులు, వంకలు, కాలువల వద్ద తమ అవసరాల నిమిత్తం ఆయా ప్రాంతాల్లోని సచివాలయం లో దరఖాస్తు చేసుకొని యంత్రాల సహాయం లేకుండా మనుషుల ద్వారా ఇసుక తవ్వకాలు చేసుకొని వారి సొంత నిర్మాణ అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో రవాణా చేయకూడదన్నారు. ఈ-ట్రాన్సిట్ ఫారం, పర్మిట్ లేకుండా ఇసుక రవాణా చేస్తే ఏ వాహనానైనా బ్లాక్లిస్టులో నమోదు చేసి నిబంధనల ప్రకారం ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఆదేశాల ప్రకారం సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ విభాగాధిపతులు పర్యవేక్షించాలని ఆదేశించారు.



9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, యంత్రాంగం

ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మునిరాజా పిలుపునిచ్చారు. మోడీ మూడోసారి అధికారానికి వచ్చిన తరువాత కార్మికుల కడుపు కొట్టే చట్టాలను తీసుకొచ్చారన్నారు. సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసి చీకటి చట్టాలను తిప్పికొట్టాలన్నారు. కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, పని గంటలు పెంచొద్దని, మహిళలకు పని వేళల్లో భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. నాయకులు ఎ.విజయ్, దేవరెడ్డి, ధన, వై.నందయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో తాము పాలు పంచుకుంటున్నట్లు శ్రీకాళహస్తి లారీ అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను స్థంభింపజేసి మోడీకి తమ సత్తా ఏంటో రుచి చూపిస్తామని లారీ అసోసియేషన్ నాయకులు అన్నారు. లేబర్ కోడ్ల రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను అమలు చేసే వరకు పోరు ఆగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్‌లో.. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరుతూ వెటర్నరీ యూనివర్సిటీ నందు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్. జయచంద్ర, కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ జిల్లా జేఏసీ చైర్మన్ నాగ వెంకటేష్ లు మాట్లాడుతూ నేడు దేశంలో కార్మికులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల ఫలితంగా వారి బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయి. దేశంలో మోడీ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న సమ్మె కోసం కార్మికులంతా ఒక తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మిక చట్టాలన్నింటిని రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆప్కాస్ యూనియన్ నాయకులు సుభహాన్, బాబు, గురు, రెడ్డి, నందు, అలీ పాల్గొన్నారు.

బాలు రాసిన గేయానికి 'మహారాష్ట్ర'పాఠ్యాంశంలో చోటు

ప్రజాశక్తి -తొట్టంబేడు



మండలంలోని దిగువ సాంబయ్యపాలెం ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న కయ్యూరు బాలసుబ్రమణ్యం రాసిన గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు పాఠ్యాంశంలో చోటు కల్పించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రాసిన సీతాకోకచిలుక గేయాన్ని ఒకటవ తరగతి పాఠ్యాంశంలో చేర్చడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు.



తిరుపతి ఐఐటిలో నిర్మాణాలపై అంతర్జాతీయ సమావేశం

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు సమీపంలో ఉన్న ఐఐటి తిరుపతిలో మూడు రోజులపాటు ఐసీసీఎంఎస్ 2025 అంతర్జాతీయ సమావేశం ఐఐటీ డైరెక్టర్ కే ఎన్ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. 12 దేశాలలో విద్యా, పరిశ్రమ, ప్రభుత్వం, పరిశోధనా సంస్థలలో ప్రాతినిధ్యం వహిస్తున్న 550 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ సమావేశంలో కాన్ఫరెన్స్ భౌతిక, హైబ్రిడ్ ఫార్మాట్లలో 10 ప్లీనరీ ఉపన్యాసాలు, 21 ముఖ్య ఉపన్యాసాలు, 427 టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్లు, 113 పోస్టర్ సెషన్లను నిర్వహించారు. 19 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీ, 56 మంది విద్యార్థి వాలంటీర్లు, ఐఐటి సిబ్బందికి కలిసి ప్రతినిధులకు సదుపాయాలను కల్పించారు. "సినర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్" థీమ్‌పై విశ్లేషించగా వాతావరణ మార్పు, వనరుల కొరత, డిజిటల్ పరివర్తన, పట్టణ సంక్లిష్టత యొక్క సవాళ్లను ఎదుర్కోవటానికి అధునాతన నిర్మాణ రూపకల్పనతో పదార్థాల ఆవిష్కరణను సమలేఖనం చేయవలసిన అత్యవసర అవసరాన్ని పరిష్కరించింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మైక్ ష్లైచ్, ప్రొఫెసర్ జియాన్లూకా రంజీ, ప్రొఫెసర్ మను సంతనం, ప్రొఫెసర్ మార్టిన్ మెన్సింగర్ ప్రస్తావించారు.

అకడమిక్ కన్సల్టెంట్ల సమీక్షతో బోధనలో నాణ్యత : వీసీ

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జూలై 1-5 తేదీల్లో ఎస్వీయూ విసి ఛాంబర్స్‌లో వర్కింగ్ అకడమిక్ కన్సల్టెంట్ల విద్యా పనితీరుపై సమీక్షను నిర్వహించింది. ఈ సమీక్ష వైస్-ఛాన్సలర్ ఆచార్య సిహెచ్. అప్పారావు అధ్యక్షతన, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతి నాయుడు, కన్వీనర్ గా విషయ నిపుణులు , సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతుల సమక్షంలో జరిగింది. 1న 41 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, 2న 43 మంది, 3న 60మంది, 4న 47 మంది, 5న 50 మంది అకడమిక్ కన్సల్టెంట్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సమీక్షతో బోధనలో నాణ్యతపెరుగుతుందని వీసీ పేర్కొన్నారు.

పోరాటాలపై 'ఎస్మా' బూచి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజాదృష్టి

రాత్రనకా... పగలనకా.. ఆహర్నిశలు కష్టపడే కార్మికుడికి శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. కష్టాన్నే నమ్ముకునే కార్మికుల జీవితాలు కాంట్రాక్టర్లు, అధికారుల చేతుల్లో నలిగిపోతున్నాయి. తమ కష్టాన్ని గుర్తించండి మహా ప్రభో అంటే చీత్కరింపులు తప్పడం లేదు. న్యాయం చెయ్యమని వేడుకుంటే పట్టించుకునే నాథుడే లేడు. వినతులు, ధర్నాలు, నిరసనలు చేపడితే బెదిరింపులకు కొదవలేదు. విసిగి వేసారి సమ్మె బాట పడితే ఎస్మా పేరుతో ఆధిపత్యం చెలాయించాలనుకోవడం పరిపాటిగా మారిపోయింది. సామాన్యుడు తమ గోడును ఎవ్వరికి చెప్పుకోవాలో అర్థంగాని అయోమయంలో తచ్చాడుతున్నాడు. ఇలాంటి వారందరికి ఎర్రజెండా అండగా నిలుస్తోంది. పోరాడితే పోయేదదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప అంటూ నినాదిస్తూ, చేయి చేయి కలిపి ఉధృత పోరాటాలకు పేదవాడిని సన్నద్ధం చేస్తోంది. కడుపు కాలే పేదవాడి ఆగ్రహానికి పాలకులు తలవంచక తప్పడం లేదు. అలాంటి వాటిలో మచ్చుక ఒకటి స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల పోరాటం.

టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న అతిపెద్ద పేదల ఆసుపత్రి స్విమ్స్. మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య కళాశాల నెలకొల్పిన ఘనకీర్తి గలది. కానీ అక్కడ పని చేసే 3వ తరగతి మహిళా ఉద్యోగుల పట్ల కనీసం మానవత్వం చూపడం లేదు స్విమ్స్ యాజమాన్యం. మహిళలకు ఉద్యోగులకు భద్రత కరువు. లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఉండవు. కార్మికులకు విశ్రాంతి గదులు నిల్. ఆఖరికి మహిళా ఉద్యోగినులు దుస్తులు మార్చుకోవడానికి గది కూడా ఉండదు. సమానపనికి సమానవేతనం లేదు. కనీసవేతనం చట్టం అమలు కాదు. జీతాలు పెరగవు, బతుకులు మారవు. ఇది స్విమ్స్ కాంట్రాక్టు కార్మికుల దీనగాథ. రెండు సంవత్సరాలుగా స్విమ్స్ కాంట్రాక్టు కార్మికులు వేతనాలు ఎక్కడేసిన గొంగిడి అక్కడే అన్న చందాగా తయారైంది. ఇందుకు ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యం. వార్డుబాయ్స్‌గా ఉన్న కార్మికులను పేరుమార్చి శానిటరీ వర్కర్స్‌గా నమోదు చేసి టిటిడికి పైలు అందజేశారు. అధికారుల అనాలోచిత నిర్ణయంతో వీరు పోరుబాట పట్టారు. జూన్ 4వ తేది తమ సమస్యలు పరిష్కారం కాకపోతే జూన్ 18 నుంచి సమ్మె తప్పదని హెచ్చరించారు. జూన్ 17వ తేది వరకు వేచి ఉన్న అధికారులు, అదే రోజు కార్మికులను డిసిఎల్ సమక్షంలో చర్చలకు పిలిచారు. స్విమ్స్ అధికారుల తప్పిదం వల్లే కార్మికులకు ఇబ్బంది కల్గిందని అంగీరించారు. జూన్ 24వ తేది మరో దఫా డిసిఎల్ ఎదుటే చర్చలు జరిపారు. ఈ సారి డిసిఎల్ నుంచి స్విమ్స్ అధికారులకు చివాట్లు తప్పలేదు. కానీ పరిష్కారం నిల్. స్విమ్స్ రోగులకు వైద్యం అందించే ఆసుపత్రి కావడంతో దాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికులు కాస్త సంయమనం పాటించారు. సమ్మె వైపు వెళ్లకుండా రిలే దీక్షలు చేపట్టారు. దీంతో అధికారులు ఏమి జరుగుతుందిలే అనే నిర్లక్ష ధోరణి ప్రదర్శించారు. కార్మికులు రోజుకో పద్దతిలో వినూత్న నిరసనలతో హోరెత్తించారు. విదేశాల నుంచి వచ్చిన ఈవో సమస్యలోతుల్లోకి వెళ్లకుండానే కార్మికులపై ఎస్మా ప్రయోగించేందుకు సిద్ధమయ్యారు. అందుకుతగ్గట్టు స్విమ్స్ డైరెక్టర్ అత్యవసర ఆసుపత్రుల్లో సమ్మెకు ఆస్కారం లేదని, చేస్తే ఉద్యోగాలు ఊడగొడుతాం అంటూ బెదిరింపులకు దిగారు. తప్పని సరి పరిస్థితుల్లో జూలై 3వ తేది కార్మికులందరూ ఏకమై సమ్మెలోకి దిగారు. అత్యవసర పనులను మినహాయించారు. కార్మికులు 6 గంటలు పనిలోకి పోకపోయేసరికి వైద్యసేవలు స్థంభించాయి. ఆగమేఘాలపై డైరెక్టర్ కార్మికుల వద్దకు పరిగెత్తారు. రోజుకో మాట మాట్లడుతున్న స్విమ్స్, టిటిడి అధికారుల మాటలు కార్మికులు నమ్మరని తెలిసి, రెవిన్యూవిభాగం నుంచి ఆర్‌డివో, పోలీసు విభాగం నుంచి ఏఎస్‌పిని సాక్షులుగా తీసుకుని, వారి ఎదుటే డైరెక్టర్ కార్మికుల వద్దకు వచ్చి శాంతించమని కోరారు. టిటిడి అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏదిఏమైనా చర్చలు ఫలించాలని ఆశిద్దాం.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక త్యాగరాజ వీధిలోని శ్రీ కల్యాణవీరభద్ర స్వామి ఆలయంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గూడూరు అమరావతి ఆస్పత్రికి చెందిన డాక్టర్ నిర్మల ఐదు వేల రూపాయలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి మాధురి, కార్యదర్శి లక్ష్మీ, స్నేహలత , రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్ కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ బాధితులు 30 మందికి పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యకులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నెలా డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో నెల్లూరు పాజిటివ్ నెట్‌వర్క్ ప్రెసిడెంట్ ధనుర్జ, ఆర్.ఎం.వో ప్రసన్న , ప్రగతి సేవా సంస్థ సభ్యులు శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు , వెంకటేశ్వర రావు, మురళి నాయుడు, ప్రభాకర్, యశ్వంత్, నాగరాజు, విజయ్, నాగేంద్ర, మౌల, సాయి పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఉపాధి హామీ పనుల్లో భాగంగా చేపట్టిన కారని మిట్ట వెస్ట్ వరత్తూరు పంచాయతీ చెరువు పూడిక తీత, కట్ట బలోపేతం పనులను ఉపాధి హామీ సంచాలకులు దేవర పేర్కొన్నారు. ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది మంది శ్రామికులు చేస్తున్న పనులకు వారి కొలతలు ప్రకారం పని చేసి రోజుకు రూ.300, వారానికి 1800, వంద రోజులకు 30 వేల రూపాయలు ఓ ఆర్థిక సంవత్సరంలో వేతనం పొంది కుటుంబ ఆర్థిక స్థితి గతులు మెరుగు పరచుకోవాలని సంచాలకులు పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకట రత్నమ్మ మాట్లాడుతూ ఆది లక్ష్మమ్మ ఇంటి వద్ద వర్మి కంపోస్ట్ పిట్ పరిశీలించి, ప్రతి ఇంటి వద్ద వర్మి కంపోస్ట్ పిట్లు తవ్వుకోవాలని సూచించారు. రైతులు బోర్లు, బావులలో నీరు పుష్కలంగా ఉండేందుకు రైతుల పొలాల్లో ఫారం పాండ్‌లు తవ్వి వర్షపు నీటిని నింపి భూగర్భ జలాలను పెంపొందించుకోవాలని సంచాలకులు దేవర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ వరత్తూరు పంచాయతీ సెక్రటరీ జె జలక్ష్మి, అదనపు కార్యక్రమాధికారి అవిలాల దేవరి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భానుశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ మధుసూదన్, ఫీల్డ్ అసిస్టెంట్ పి భారతి, రవి, ఉపాధి శ్రామికులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -తొట్టంబేడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పొయ్య పంచాయతీ గురుకుల పాఠశాలలో శనివారం జనసేన నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు పేట చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పేట చిరంజీవి, లక్ష్మణ్, ప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

చెంగాలమ్మ హుండీ ఆదాయం రూ.61 లక్షలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి పరకామణి (హుండీ లెక్కింపు) శనివారం నిర్వహించారు. 103 రోజులకు రూ.61,71,477 రూపాయల నగదు, బంగారం 0.35గ్రాములు, వెండి 130 గ్రాములు, విదేశీ కరెన్సీ - యుఎస్ఏ డాలర్స్-10, సింగపూర్ డాలర్ -5, మలేషియా-10 రింగట్స్, సౌదీ రియాల్స్-1, యూరో-5 ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, మెప్మా సభ్యులు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు, పోలీసు శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది, కార్యనిర్వహణాధికారి కె నవీన్ కుమార్ వర్షవల్లేకులతో సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బి ప్రసన్నలక్ష్మి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


హుండీ లెక్కిస్తున్న చెంగాలమ్మ ఆలయ సిబ్బంది

సమస్యలు పరిష్కరించండి..

టిటిడి ఈఓకు ఎమ్మెల్యే వినతి

తిరుపతి: తిరుమలలోని స్థానికుల సమస్యలు పరిష్కరించాలని టిటిడి ఈఓ శ్యామల రావును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. శనివారం సాయంత్రం పద్మావతి అతిథి గృహంలో ఈఓ శ్యామలరావు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భేటీ అయ్యి వివిధ సమస్యలపై చర్చించారు. ఆర్బీ సెంటర్ లో నివాసం ఉంటున్న 84 మంది స్థానికులకు తిరుమలలోనే నివాస సౌకర్యం కల్పించాలని ఈఓను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. బాలాజీ నగర్‌లో ఇళ్లకు ఫుల్లు వేయించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. తిరుపతి నగరం లోని ఏడు రోడ్ల నిర్మాణాలు టిటిడి పునరుద్ధరించాలని పాటు పారిశుధ్య కార్మికులను నియమించాలని ఎమ్మెల్యే ఈఓను కోరారు. కాగా స్విమ్స్, మెటర్నిటీ హాస్పిటల్, బర్డ్, రుయా ఆస్పత్రుల వద్దాల భూమిలో ఇంకొక పోటాలనిలో మంచినీళ్లు గుంట కలుషితం పైనందున ఈ దృష్టికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్లు నరసింహాచారి, నరేంద్ర తీసుకెళ్లారు. ఆస్పత్రులకు యూడిజి ఏర్పాటు చేసి కార్పొరేషన్ డ్రైనేజ్‌లో కలిపేలా చూడటంతో పాటు మంచినీళ్లగుంట నిర్వహణను టిటిడి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

16న ఆణివార ఆస్థానం

ప్రజాశక్తి -తిరుమల: జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఈ రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. జూలై 14, 15వ తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు అంగీకరించబడవని తెలిపారు. భక్తులు ఈ మార్పును దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరారు.



మృతురాలికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి -ఏర్పేడు: సీతారాంపేట గ్రామ వైసిపి అధ్యక్షుడు అక్కుపల్లి లోకేష్ యాదవ్ చిన్నమ్మ అక్కుపల్లి లక్ష్మి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సీతారాంపేటలోని వారి సొంత ఇంటికెళ్లి లక్ష్మి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్ యాదవ్, మునిక్రిష్ణారెడ్డి, రాజారెడ్డి, ఏర్పేడు సర్పంచ్ శివయ్య, మునిరత్నం రెడ్డి, గంగయ్య యాదవ్, ప్రభు, లోకనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

దళిత గిరిజనులకు భూములు పంచాలి

సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: కలపాడు గ్రామ దళిత గిరిజనులు, బలహీన వర్గాల వారికి ప్రభుత్వ భూములు పంచాలని కోరుతూ కలపాడు భూ పోరాట కమిటీ, సిపిఎం ఆధ్వర్యంలో కలపాడు గ్రామ దళిత గిరిజనులు శనివారం ధర్నా నిర్వహించారు. మొదట వెంకటగిరి ఆర్టీసీ బస్టాండ్ నుండి తహశీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కలపాడు గ్రామ పంచాయతీ పరిధి సర్వే నంబర్ 1 లో1441 ఎకరాల ప్రభుత్వ మేత పోరంబోకు భూములు ఉన్నాయన్నారు. గ్రామంలో వంద లాది మంది భూమిలేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున ఆ భూములను పేదలకు పంచాలన్నారు 2013 వ సంవత్సరం నుండి దళిత గిరిజనులు ఈ భూములు అప్పటి నుండి మండల స్థాయి అధికారులు, జిల్లా స్థాయి అధికారులు చుట్టూ తిరుగుతున్నా వారికి ఇంతవరకు న్యాయం చేయలేదన్నారు. గ్రామంలో రాజకీయ పలుకుబడి కలిగిన అగ్రకుల పెత్తందారులు రాత్రికి రాత్రే జెసిపిలను పెట్టి చదును చేస్తున్నారని, పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ విఆర్వో అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్నారన్నారు. దళిత గిరిజనులకు అన్యాయం చేస్తున్న అగ్రకుల పెత్తందారులపై, వీఆర్‌వోపై చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలంతా ఐక్యంగా ఐక్యంగా పోరాడి సాధించు కోవాలన్నారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెంచు కృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, సమరం, నాగేశ్వరరావు, దారా కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్య

శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి -సత్యవేడు: కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. శనివారం ఆమె సత్యవేడు పట్టణం పల్లాపు వీధిలోని ఎస్ఎస్ మందుల షాపు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంతి మీడియాతో మాట్లాడుతూ ఎస్ఎస్ మందుల షాపులో కాలం చెల్లిన మందులను రోగి శోభారాణికి విక్రయించింది వాస్తవమే అన్నారు. కాలం చెల్లిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించ కూడదన్నారు. అయితే ఈ మందుల షాపుకు పక్కనే ఉన్న ఎస్ఎస్ నేచరల్ క్యూర్ క్లినిక్ నడుపుతున్న ఆర్ఎంపీ వైద్యులు సోమశేఖర్ సిఫార్సు మేరకు ఎస్ఎస్ మెడికల్ షాపులో రోగికి మందులు ఇచ్చారన్నారు. కాలం చెల్లిన మందులు ఇవ్వడంతో బాధితురాలు శోభారాణి మందు అట్టపై ఉన్న ఎక్స్‌పైర్ తేదీని గమనించి దీనిపై ఫిర్యాదు చేసిందన్నారు. దీంతోపాటు పత్రికల్లోనూ వార్తా కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో ఎస్ఎస్ మందుల షాపును తనిఖీ చేశామన్నారు. ఈ మందుల షాపులో ఆయుర్వేద మందులు విక్రయిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. ఆర్ఎంపీ వైద్యులు రోగులకు ప్రాథమిక చికిత్స చేయాలే తప్ప మందుల చీటీలను రాసి ఇచ్చే అధికారం లేదన్నారు. ఈ విషయాన్ని సంబంధిత జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు చూడాల్సిందే తప్ప తమ పరిధికి రాదన్నారు. ఏది ఏమైనా కాలం చెల్లిన మందులు విక్రయం వాస్తవమేనని రుజువు కావడంతో ఎస్ఎస్ మందుల షాపు లైసెన్సు రద్దు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. బాధితురాలు శోభారాణి, ఎస్ఎస్ మందుల షాపు ఫార్మసిస్ట్, ఆర్ఎంపీ వైద్యులు సోమ శేఖర్ నుంచి స్టేట్‌మెంటు నమోదు చేశారు.



ఎస్ఎస్ మెడికల్ షాపులో మందులు తనిఖీ చేస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు పంపిణీ


నోటు పుస్తకాలు అందించిన దాతలు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవకోనలోని అక్షరయజ్ఞం స్టడీ సెంటర్ల లో శనివారం 30 మంది విద్యార్థులకు నోటు పుస్తకా లు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేసారు. రంజిత్ పుట్టినరోజు సందర్భంగా అతని స్నేహితులు పవన్ పిల్లలకు పుస్తకాలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ డైరెక్టర్ మరుపూరి శేఖర్ మాట్లాడుతూ రంజిత్ పుట్టినరోజు సందర్భంగా పేద పిల్లలకు నోటు పుస్తకాలు అందించ డం అభినందనీయమన్నారు. ఎవరైనా పుట్టిన రోజులు, ఇతర శుభాకార్యాల సందర్భంగా పిల్లల విద్యాభివృద్ధికి అవసరమయ్యే కిట్స్ అందించవచ్చని తెలిపారు. దాత పవన్ మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా వెచ్చించే అనవసరమైన ఖర్చులు తగ్గించుకుని పిల్లలకు అవసరమైన పుస్తకాలు ఇవ్వడం చాలా ఆనందంగా వుందన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ స్టడీ సెంటర్లు పేద పిల్లలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్లు గోపమ్మ, శ్వేత , దాతలు పాల్గొన్నారు.

మామిడి రైతుల అవస్థలు పట్టవా? : వైసిపి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చిత్తూరు ఉమ్మడి జిల్లాలో మామిడి రైతుల అవస్థలు పడుతున్నారని వైసిపి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పద్మావతిపురంలోని ఆయన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు అవస్థలు పడుతున్నారని రైతుల కోసం బంగారుపాల్యం గ్రామానికి వస్తున్నారు. అప్పుడే కూటమి నాయకులు రైతులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను చూస్తే కూటమి ప్రభుత్వానికి భయమని అందుకే జగన్ పర్యటన రద్దయ్యిందని చెప్పుకుంటున్నారన్నారు. గిట్టుబాటు ధర లేక మామిడి చెట్లు నరికేశాడని, ఫారెస్ట్ అధికారి కుమార్ అనే రైతును నానా ఇబ్బందులకు గురి చేయడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మృతురాలికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - రేణిగుంట: నారాయణ కాలేజీ ఎదురుగా అమరరాజా బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు మండల అధ్యక్షులు కాంజేరి సెల్వరాజు, రాజశేఖర్ డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. వైద్య ఖర్చులను అమరరాజా కంపెనీ భరించాలని డిమాండ్ చేశారు. అమరరాజా యాజమాన్యం డ్రైవర్లపై ఒత్తిడి తెచ్చి ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయకుండా 12 గంటలు అమలు చేస్తోందన్నారు. నిద్రలేమి వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. సత్యశ్రీ, దీపం మాట్లాడుతూ మహిళలతో రాత్రి డ్యూటీలు చేయించడం వల్ల భద్రత లేకుండా పోయిందన్నారు.

మామిడి కోసిన తర్వాత సస్యరక్షణ ముఖ్యం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: మామిడికాయల కోతల అనంతరం రైతులు ముఖ్యంగా సస్య రక్షణ పాటించాలని విజయవాడ కేంద్రీయ సమగ్ర సమస్య అధికారి వీరయ్య చౌదరి అన్నారు. రామచంద్రా పురం మండలంలోని కమ్మ కండ్రిగ, గంగిరెడ్డిపల్లి, నడవలూరు, రామచంద్రాపురం గ్రామాలలో శనివారం మామిడి తోటల రైతులతో ఉద్యానవన పంటల పైన అవగాహన కల్పించారు. రైతులతో కలిసి మామిడికాయలు కోసి వేసిన తోటలలో కలియ తిరిగారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ కాయలు కోసిన కొద్ది రోజులకు కింద ఉండే కొమ్మలను కత్తిరించాలన్నారు. మొక్కలకు నీళ్లు పారించి, ఎరువులు వేస్తే తరువాత సంవత్సరానికి పంట దిగుబడి మరింత ఆశాజనకంగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కాయలను పండు ఈగలు కుట్టడం వల్ల చాలావరకు నష్టం వాటిల్లుతున్నట్లు రైతులు పలుచోట్ల ఫిర్యాదులు చేశారని చెప్పారు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఈగల నుంచి పంటను కాపాడి నాణ్యమైన కాయలను పొంద వచ్చని తెలిపారు. అక్కడక్కడ ఈగల నివారణ కోసం బుట్టలను వేలాడ దీయటం, కాయలకు కవర్లను చుట్టటం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి శివకుమారి,(గామ ఉద్యానవన సహాయకురాలు పూజిత పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వం అనేక పేర్లతో పెంచిన విద్యుత్ చార్జీల వల్ల పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ పేర్కొన్నారు. విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని గూడూరు పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్ కుమార్ , ఏఐటీయూసీ నియోజక వర్గ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ ఏర్పాటును ఉపసంహరించు కోవాలని, ఆదానితో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని కోరుతూ పుత్తూరు విద్యుత్ కార్యాలయ టెక్నికల్ ఏఈ నాగ ప్రసాద్‌కు శనివారం సిపిఐ పట్టణ కార్యదర్శి డిమహేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు కృష్ణారెడ్డి , రమణ ,రవి పాల్గొన్నారు.

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు మానుకుని ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు . శనివారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద సిపిఐ నగరసమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తూ తగ్గించాలని నిరసన ధర్నా చేపట్టారు.

శ్రీకాళహస్తి : సామాన్యుల పాలిట ఉరితాళ్లుగా మారే స్మార్ట్ మీటర్లను బిగించవద్దంటూ స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద సిపిఐ నాయకులు శనివారం నిరసన తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలో కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ పలు కేసులు పరిష్కరించారు. ఏడవ అదనపు జిల్లా జడ్జి కె వెంకట నాగ పవన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాచమార్గమని, క్షణికావేశంలో జరిగిన చిన్నచిన్న గొడవల వల్ల కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్ ద్వారా రాజీ అయ్యే కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ కుదుర్చుకునేందుకు వచ్చిన వారి కేసులను పరిశీలించి పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి సులోచన రాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమాశంకర్, న్యాయవాదులు అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, ఎస్‌కె మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురి చేయడమే వైసిపి లక్ష్యం: ఎమ్మెల్యే


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్ : ప్రజలను కష్టాలు పెట్టి ఇబ్బందులకు గురిచేయడమే వైసిపి నాయకుల లక్ష్యమని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం వడమాలపేట మండలం తిరుమణ్యం లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమన్యం- యనమల పాల్యం రోడ్డు గ్రామంలో రూ.77 లక్షల అంచనాతో చేపట్టిన రోడ్డుకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకుంటుందని గత పాలనలో వైసీపీ నాయకులు సిండికేట్లుగా ఏర్పడి మామిడి రైతులను నిండా ముంచారని గుర్తు చేశారు. గుంతల మయమైన రోడ్లను బాగు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు, ఎస్ బి ఆర్ పురం సర్పంచ్ మణి, మాజీ జెడ్పిటిసి మురళి రెడ్డి, మాజీ అధ్యక్షులు జానా వెంకటయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాల సమ్మెను జయప్రదం చేయండి

అఖిలపక్ష విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - క్యాంపస్ : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల పక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో ఐఎఫ్‌టియు కార్యాలయంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ఎస్‌యూ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మన్నం ప్రేమ్ కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏపీ స్టూడెంట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి , ఓబిసి తిరుపతి జిల్లా అధ్యక్షులు కె తిరుమలేష్, బిడివిఎస్ వ్యవస్థాపకులు కె యుగంధర్, ఏపీవిహెచ్ఎస్ తిరుపతి, జిల్లా అధ్యక్షులు ఎం ముని, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎం నాగేంద్ర పాల్గొని మద్దతు తెలిపారు.

వైసీపీ నేతల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారంటూ ఎర్రావారిపాలెం మండలంలో శనివారం వైసీపీ నేతలు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. మండల వైసీపీ నాయకులు చెంగల్ రెడ్డి, జడ్పిటిసి కరుణాకర్ రెడ్డి, ఆధ్వర్యంలో వైసిపి నాయకులు కార్యకర్తలు, నల్లజెండాలు చేత పట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నాయకులను చెవిరెడ్డిని ఆయన కుమారుడు మోహిత్ రెడ్డిని వేధింపులకు గురి చేసి జైలు పాలు చేయడానికి కుట్రపడుతున్నారని విమర్శించారు. వెంటనే ఇలాం టివి మానుకోవాలన్నారు.

భిక్షగాళ్ల పునరావాస కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో భిక్షగాళ్ల పరివర్తన కోసం ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. స్మైల్ ప్రాజెక్టులో భాగంగా ముత్యాలరెడ్డిపల్లి వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భిక్షగాళ్ల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. నగరంలో ఎక్కడైనా భిక్షగాళ్లు ఉంటే ఈ కేంద్రానికి తీసుకురావచ్చని, వీరికి ఈ కేంద్రంలో అన్ని వసతులు కల్పించి వారికి ఇష్టమైన వృత్తిలో శిక్షణ ఇస్తామన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి -రేణిగుంట : డెంగీ మాసోత్సవాలు, ప్రతి శనివారం జరిగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా తూకివాకం ఒకటో సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎఎన్ఆర్ కాలనీలో ఇల్లుల్లూ తిరుగుతూ డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, ఆరోగ్య కార్యకర్తలు బిందు, రాఘవేంద్రరావు, ఉమామహేశ్వరి, వరలక్ష్మి, విజయ పాల్గొన్నారు.

8న జిల్లా బేస్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పురుషుల, మహిళల బేస్ బాల్ జట్ల ఎంపిక ఈనెల 8వ తేదీన మంగళం పరిధిలోని మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్నారని తిరుపతి జిల్లా బేస్ బాల్ సంఘం అధ్యక్షుడు సోము రవికుమార్, కార్యదర్శి సాంబశివరావు ఆధ్వర్యంలో జరగనున్నట్లు మంగళం ట్రెండ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు తెలిపారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి సొంత క్రీడా పరికరాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన వారు ఈనెల 12 నుండి 14వ తేదీ వరకు సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ కనబరిచిన వారు మహారాష్ట్ర అమరావతిలో నిర్వహించే జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక అవుతారన్నారు.

సుపరిపాలనకు తొలి అడుగు: టిడిపి

ప్రజాశక్తి -తొట్టంబేడు:

మండలంలోని బసవయ్యపాలెం పంచాయతీ జ్ఞానమ్మ కండ్రిగ గ్రామంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తొట్టంబేడు మండలం టిడిపి మండల అధ్యక్షులు రావెళ్ల మునిరాజు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గం పూర్తిస్థాయి అభివృద్ధి కోసం ఆయా మండలాలు, గ్రామ పంచాయతీల స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నామని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళం తిరుమల నగర్ గ్రామ పంచాయతీ రామచంద్ర నగర్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం నాలుగో రోజులో భాగంగా స్థానికంగా ఉన్న ప్రజలను ఏడాది కూటమి ప్రభుత్వ పాలనపై అభిప్రాయ సేకరణ చేసి వారితో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గోపీనాథ్, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి చెన్నరాయప్ప, రామకృష్ణ, సతీష్, ప్రభాకర్, చలపతి, మాతయ్య, సుబ్బు యాదవ్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని పెనుబాక గ్రామంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో- తొలి అడుగు కార్యక్రమంలో సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో పంచాయతీల పాలన పాడెక్కిందన్నారు. అనంతరం ఏడాది పాలనలో సాధించిన అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

హిజ్రా ఇంట్లో దొంగతనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ గ్రామ పంచాయతీ వెంకటేశ్వర కాలనీలో నివసిస్తున్న హిజ్రా ఝాన్సీ తమ ఇంట్లో దొంగతనం చోటుచేసుకుందని తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. వెంకటేశ్వర కాలనీ ఇంటి నెంబర్ 351లో గత 20 ఏళ్ల నుండి నివాసం ఉంటూ తిరుపతి నగరంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని తెలిపారు. నాలుగో తేదీ భిక్షాటన చేసుకుని రాత్రి 11 గంటలకు ఇంటికి రాగా తలుపులు తెరిచి వున్నాయని ఇంట్లో ఉన్న రెండు రాగి బిందెలు, ఐదు సవర్ల బంగారం, రూ.75 వేల రూపాయల నగదు, ఏటీఎం కార్డును కూడా దొంగలించి అర్ధరాత్రి ఏటీఎం సెంటర్లో డబ్బులు డ్రా చేయడానికి ప్రయత్నం చేసినట్లుగా సెల్ ఫోనుకు సమాచారం అందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

టన్ను ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట పట్టణం లోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద నాయుడుపేట-వెంకటగిరి రహదారిపై శనివారం అటవీశాఖ అధికారులు ఒక టన్ను ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వెంకటగిరి నుంచి చెన్నైకి ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న కారు నాయుడుపేట అగ్నిమాపక శాఖ కార్యాలయం వద్ద మోటర్ బైక్‌ను ఢీకొని నిలిచిపోయింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అగ్నిమాపక సిబ్బంది కారు వద్దకు రావడంతో ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. అగ్నిమాపక సిబ్బంది అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో నాయుడుపేట అటవీ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని ఎర్రచందనం దుంగలు వున్న కారును తమ కార్యాలయం వద్దకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

బాలిక ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పద్మావతి నగర్‌కు చెందిన గీతాంజలి (17) రెండుడ రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల అదే ప్రాంతంలో నివసిస్తున్న నవీన్ తో ప్రేమలో పడింది. విషయం తెలుసుకున్న ఇద్దరి కుటుంబాల మధ్య గొడవ చోటుచేసుకుంది. గొడవల కారణంగా వేరే ఇంటికి నవీన్ కుటుంబం తరలి వెళ్లింది. బాలిక ఫోన్ నుండి నవీన్ కు మెసేజ్‌లు రావడంతో బాలికను నవీన్ కుటుంబం కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో బాలిక గురువారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు బాలిక గీతాంజలి తండ్రి చిన్నబ్బ ఫిర్యాదు మేరకు నవీన్, సుశీల, కన్నెమ్మలపై తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

ఒకరు మృతి,11 మందికి గాయాలు

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట నారాయణ కళాశాల సమీపంలో శనివారం ఆగి వున్న లారీని ఢీ ప్రైవేటు కంపెనీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 11 మంది గాయపడ్డారు. మృతురాలు అమర్ రాజా కంపెనీలో విధులు నిర్వహిస్తున్న ఉషా మహాలక్ష్మి (25)గా గుర్తించారు. గాయపడిన క్షతగాత్రులను అమరాజ హాస్పిటల్ కు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలానికి చేరుకున్న డిఎస్‌పి శ్రీనివాసరావు పరిశీలించారు. రేణిగుంట ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి-నాయుడుపేట: ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. నాయుడు పేట వేదనపర్తి సుందర్ రామ్ రెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో శనివారం ముఠా వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ ముఖ్య అజెండాలైన కూలి రేట్లు, దేశవ్యాప్త సమ్మెలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఠా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ముఠా వర్కర్స్‌ని ఏ ప్రభుత్వం గుర్తించడం లేదని ఇప్పుడు ఉన్న కూటమి ప్రభుత్వం అయినా ముఠా వర్కర్స్ గుర్తించి ముఠావర్కర్స్ కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ ఉప్పు, పప్పు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ముఠా వర్కర్స్ కి కూలి రేట్లు మాత్రం పాతాళంలో ఉన్నాయని అన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ముఠా వర్కర్స్ పోరాటం చేసినప్పుడు ఓనర్లు మూడు సంవత్సరాల కొకసారి కూలి రేట్లు పెంచుతామని హామీ ఇచ్చారని కానీ ఇంతవరకు కూలి రేట్లు పెంచలేదని, వారికి హెల్త్ ఇన్సూరెన్స్ లు వెంటనే ఏర్పాటు చేయాలని వారికి సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 9వ తేదీ చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పేరయ్య, మహేష్, వేలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ : అగ్ని ప్రమాదాల నివారణ అప్రమత్తంగా ఉండడంతోనే సాధ్యం అవుతుందని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. గోవిందరాజుల ఆలయం సన్నిధి వీధిలో అగ్ని ప్రమాదం చోటు చేసు కున్న నేపథ్యం లో కమిషనర్ మౌర్యతో కలిసి విపత్తు నివారణ అగ్నిమాపక శాఖ అధికారులు, షాపు నిర్వాహకులతో సంస్థ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ఆలయాలు ఉన్న ప్రాంతాల్లో భక్తులకు, షాపులో పనిచేసే కార్మికుల భద్రత రీత్యా అందరూ నిబంధనలు పాటిస్తూ అగ్ని ప్రమాదాలను నివారించాలని అన్నారు. గోవిందరాజుల స్వామి గుడి వద్ద గతంలోనూ ఇదే ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. షాపులు ఒకే చోట కేంద్రీకరించి ఉండడంతో విపత్తు నివారణ అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించడం లేదన్నారు. ఉప కమిషనర్ అమరయ్య, ఎస్ఇ శ్యాం సుందర్, పాల్గొన్నారు.